

మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో జైలుపాలైన జేడీఎస్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు షాక్ ఇచ్చింది. అత్యాచారం కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రజ్వల్ రేవణ్ణ తరపు న్యాయవాదులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను గురువారం కోర్టు విచారణ జరిపింది. దీనిపై ప్రభుత్వం తరుపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా అతడు వ్యవహరించారని వయస్సుతో సంబంధం లేకుండా మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారని వాదించారు. దీంతో న్యాయమూర్తి పిటిషన్‌ను తిరస్కరించారు.

గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవుపై పోరాటం



- అంకోలాలో రూ.4,118 కోట్లతో ఓడరేవు నిర్మాణానికి ప్రయత్నాలు
- దశాబ్దం నుంచి ప్రతిపాదనలు
- వ్యతిరేకిస్తున్న మత్స్యకారులు
- వందలాది బోట్లతో సముద్రంలో నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు జిల్లాల పరిధిలో అరేబియా సముద్రం ఆవరించి ఉంది. శతాబ్దాలకాలంగా మూడు జిల్లాలకు చెందిన లక్షలాదిమంది మత్స్యకారులు చేపలవేటే జీవనాధారంగా జీవిస్తున్నారు. సీజన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల మత్స్యకారులు ఇక్కడికి వస్తుంటారు. దక్షిణకన్నడ జిల్లా మంగళూరులో నవ మంగళూరు పేరిట భారీ ఓడరేవు ఉంది. ఇక్కడనుంచే దక్షిణభారత వ్యాప్తంగా అవసరమైన చమురు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. అందుకు సంబంధించి భారీ ప్లాంట్లు ఉన్నాయి. ఉడుపి జిల్లాలో మల్పెతోపాటు పలు బీచ్‌లు ఉన్నాయి. ఉత్తరకన్నడ జిల్లా కేంద్రం కారవారలో దేశంలోనే పేరొందిన నౌకాయాన కేంద్రం ఉంది. ఇక్కడ వేలకోట్ల రూపాయలతో నౌకాయాన కేంద్రాన్ని నిర్మించారు. అనుబంధంగా పలు ప్రాజెక్టులున్నాయి. ఇలా మూడు జిల్లాల పరిధిలో సముద్రానికి అనుబంధంగా ఉండే ప్రాంతాల్లో భారీ ఓడరేవులు, ప్రాజెక్టులు ఉండడంతో చేపలవేటకు ఇబ్బంది కలుగుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారున సముద్రానికి చేపలవేటకు వెళ్తే మధ్యాహ్నానికి వెనుదిరిగి మార్కెట్‌లో విక్రయిస్తే కనీసం కూలి కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడిందని ఇలాంటి తరుణంలో వాణిజ్యపరమైన ఓడరేవులు మత్స్యకారుల పాలిట ప్రమాదకరమని మండిపడుతున్నారు.

రూ.4,118 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం

అంకోలా తాలూకాకు అనుబంధంగా రూ.4,118కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మించేందుకు జేఎస్‌డబ్ల్యు కేణి పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సిద్ధమైంది. సముద్రం లోపల మట్టి పరీక్షలు జరిపారు. ఈ ప్రాజెక్టుకు సముద్రంలోనే 450 ఎకరాలను వినియోగించుకోదలిచారు. ఈ ఓడరేవు ద్వారా ఏడాదికి 3 కోట్ల టన్నుల సామర్థ్యంతో ఎగుమతులు, దిగుమతులు చేయాలని నిర్ణయించారు. సముద్రతీరంలోని సమీప ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఉద్యోగాలు సమకూర్చేలాంటి పనులు చేపడతామని కంపెనీ చెబుతోంది. ఓడరేవు నిర్మిస్తే దిగుమతులు, ఎగుమతుల ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ ప్రాజెక్టుతో ఉత్తర కర్ణాటక జిల్లాలతోపాటు బళ్ళారి, హుబ్బళ్ళి, కలబురగి దక్షిణ మహారాష్ట్ర జిల్లాలకు అవసరమైన ఎగుమతులు, దిగుమతులకు అనుకూలం కానుంది. ప్రధానంగా బొగ్గు, ముడి ఖనిజం, ఐరన్ వంటి రవాణాకు సులభతరం కానుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.



ప్రతిపాదిత వాణిజ్య ఓడరేవు నమూనా



జాతీయ స్థాయిలో సంచలనం రేపిన నిరసన

మత్స్యకారుల నిరసన జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర, అంకోలా తాలూకాల పరిధిలోని అరేబియా సముద్ర తీరంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో వాణిజ్యపరంగా ఓడరేవుల నిర్మాణానికి సిద్ధమైన సర్కారుకు ఎదురుదెబ్బ తగులుతోంది. మత్స్యకారుల పోరాటం జాతీయస్థాయిలో చర్చకు కారణమైంది. ఏకంగా వందలాది మంది మత్స్యకారులు బోట్లలో సముద్రంలోకి వెళ్లి నిరసన చేపట్టారు. ఇప్పటివరకు ఈ తరహాలో సముద్రంలో ఆందోళనలు జరిపిన సందర్భం లేదు. పోరాటానికి దిగిన 45మంది మత్స్యకారులపై పోలీసులు విధులను అడ్డుకున్నారని దాడులకు పాల్పడ్డారని, హత్యాయత్నం చేశారనే సెక్షన్‌లకింద కేసులు నమోదు చేశారు. 65 కిలోమీటర్ల మేర ఓడరేవు నిర్మిస్తే ఈ ప్రాంతంలో మత్స్యకారులు జీవనం కోల్పోవాల్సి వస్తుందన్నారు. కేణి ప్రాంతంలో సంప్రదాయమైన చేపలవేట ద్వారా 2వేలకుపైగా మత్స్యకారుల కుటుంబాలు ఉన్నాయి. ఓడరేవు నిర్మాణం అనే ఆలోచనను వారు వ్యతిరేకిస్తున్నారు. వాణిజ్యపరమైన ఓడరేవు నిర్మిస్తే కిలోమీటర్ల కొలదీ సముద్రతీరాన్ని వారు స్వాధీనంలోకి తీసుకుంటారు. ఒకవేళ మత్స్యకారుల చేపల వేటకు వెళ్లాలన్నా నివసిస్తున్న ప్రాంతం నుంచి 40-50 కిలోమీటర్లు వెళ్లి అక్కడ నుంచి సముద్రంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది.

2010లోనే సన్నాహాలు

దశాబ్దం కిందటే టొంకా ప్రదేశంలో ఏడాదికి 49లక్షల టన్నుల సామర్థ్యంతో వాణిజ్యపరమైన ఓడరేవు నిర్మించేందుకు హొన్నావర పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పనులు ప్రారంభించింది. 2010లోనే రాష్ట్రప్రభుత్వం హొన్నావరలో వాణిజ్యపరమైన ఓడరేవు నిర్మించేందుకు హైదరాబాద్‌కు చెందిన హొన్నావర పోర్ట్ ప్రైవేట్‌లిమిటెడ్‌కు లీజు పద్ధతిన 93 ఎకరాల భూమిని అప్పగించింది. 2012లో 400 మీటర్ల పొడవుతో రెండు లంగరు ప్రదేశాలను, 850 మీటర్ల పొడవుతో అడ్డుగోడలను నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకుని పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2016లో కోర్టులో మత్స్యకారులు పోర్ట్ నిర్మాణాలను రద్దు చేయాలని కోరారు. కోర్టులో కంపెనీకి అనుకూలంగానే తీర్పు వచ్చినా 2021 నాటికి పర్యావరణ అనుమతులు గడువు ముగియడంతో పనులు చేపట్టేందుకు అడ్డంకిగా మారింది. 2022లో మరోసారి పర్యావరణ అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నారు. 2024 డిసెంబరు 31న పర్యావరణ అనుమతులను రెన్యువల్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణాలకు మత్స్యకారుల ఇళ్లు ఇతరత్రా ప్రదేశాలను స్వాధీనం చేసుకునేందుకు 50 మీటర్ల నుంచి 35 మీటర్లకు కుదించారు. ఇప్పటికే వంద ఇళ్లు పూర్తి చేసుకున్నా పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. ఈలోగా భారీ ప్రాజెక్టు తెరపైకి రావడంతో మత్స్యకారుల ఆందోళన తీవ్రమైంది.



పర్యావరణానికి విఘాతం

వాణిజ్యపరమైన ఓడరేవుల నిర్మాణంతో పర్యావరణం జీవవైవిధ్యానికి భంగం కలగనుందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హొన్నావర, అంకోలా పరిధిలో ఓడరేవుల నిర్మాణం చేపడితే ఎగుమతులు, దిగుమతులు చేపట్టడం ద్వారా వ్యర్థాలు సముద్రంలోకి వెళ్లి మత్స్యసంపదతోపాటు జలచరాలు ఉనికిని కోల్పోతాయని అంటున్నారు. 2006-2010 వరకు బళ్ళారి నుంచి బెళకెరె, కారవార ఓడరేవుల ద్వారా ముడి ఖనిజాన్ని ఎగుమతి చేసిన సమయంలో దుమ్ము, ధూళితో ఈ ప్రాంత ప్రజల జనజీవనం అస్తవ్యస్థమైంది. పర్యావరణానికి ప్రమాదం కాగా ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపిందని హొన్నావర ఫౌండేషన్ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. టొంకా ప్రదేశంలో ఆలివ్, రిడ్లే, కడలామ వంటి జలచరాలు గుడ్లుపెట్టి సంతానం అభివృద్ధి చేసుకుంటాయి. ఇదే మార్గంలో ఓడరేవు వస్తే వాటి ఉనికికే ప్రమాదం కానుంది. అందుకే దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కదంతొక్కిన కమల నేతలు

- ధరల పెంపుపై బీజేపీ నిరసన
- సీఎం నివాసం ముట్టడికి యత్నం
- కీలక నేతల అరెస్ట్



మాజీ సీఎం యడియూరప్ప, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్ష నేత అశోక్‌ను తరలిస్తున్న పోలీసులు

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలైన పాల ధర పెంపు, విద్యుచ్ఛార్జీలు అధికం, డీజిల్‌పై లీటరుకు రెండురూపాయల అదనంగా విధించిన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రెండోరోజు సాగింది. గురువారం ఫ్రీడం పార్కు నుంచి కుమారకృప రోడ్‌లోని సీఎం అధికారిక నివాసం ముట్టడికి ప్రయత్నించారు. పార్టీ సీనియర్‌నేత యడియూరప్ప, పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామి తదితరులతో పాటు నాయకులంతా ర్యాలీగా బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే అప్రమత్తమైన పోలీసులు అందరినీ అరెస్టు చేసి బస్సులలో వివిధ స్టేషన్‌లకు పంపారు. ఇదే సందర్భంగా పార్టీ అధ్యక్షులు విజయేంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదబడుగు వర్గాలకు అన్యాయం చేసేలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు నిత్యావసరాల ధరల పెంపు, కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్, ఎస్సీలకు కేటాయించిన గ్రాంట్‌లు గ్యారెంటీలకు మళ్ళించి సామాన్యుల కడుపుకొడుతున్నారన్నారు. ఇవే విషయాలను ప్రజలకు వివరించే పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈనెల 7నుంచి జనాక్రోశ యాత్ర మైసూరు, చామరాజనగర్ జిల్లాలోను 8న మండ్య, హాసన్ జిల్లాలోను, 9న కొడుగు, మంగళూరులలోను 10న ఉడుపి, చిక్కమగళూరు జిల్లాలో కొనసాగిస్తామన్నారు. 13న రెండోవిడతగా శివమొగ్గ, ఉత్తరకర్ణాటక జిల్లాల్లో కొనసాగుతోందన్నారు. అరెస్టుల ద్వారా తమ పోరాటాన్ని అడ్డుకోలేరని సవాల్ చేశారు.



సీఎం ఇంటికి ర్యాలీగా వెళ్తూ..



రాహుల్ గాంధీని కలిసిన సీఎం సిద్ధరామయ్య, మంత్రులు

రాహుల్‌తో సీఎం భేటీ

- రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చలు
- గిగ్ కార్మికులకు సంక్షేమ మండలిపై ప్రస్తావన

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మూడునెలల తర్వాత ఢిల్లీకి వెళ్ళిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య బిజీగా ఉన్నారు. బుధవారం కర్ణాటక భవన్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం ఉదయం కేంద్ర జలవనరుల శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిశారు. రాష్ట్రంలో కొన్నేళ్ళకాలంగా పెండింగ్‌లో ఉండే ప్రాజెక్టులతో పాటు అనుమతులకు నోచుకోని పథకాల వివరాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. రెండేళ్ళ కిందటి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన గ్రాంట్‌లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి సోమణ్ణలు ఉన్నారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ముఖ్యమంత్రి కలిశారు. సుమారు గంటకు పైగా వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ప్రధానంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను వివరించినట్లు సమాచారం. పరిషత్‌లో ఖాళీగా ఉండే నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఎంపికతో పాటు కేబినెట్‌లో మార్పుల అంశాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చలు జరపాలని రాహుల్‌గాంధీ సూచించినట్లు సమాచారం. రాహుల్‌గాంధీతో చర్చలు జరిపిన సందర్భంగా గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ మండలి ఏర్పాటు విషయాన్ని వివరించారు. రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర చేపట్టిన సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా గిగ్ కార్మికులకు రక్షణ కల్పిస్తామని సీఎం వివరించారు. తాత్కాలికంగాను, స్వతంత్ర్యంగా పనిచేసేవారు గిగ్ కార్మికులు, ఆన్‌లైన్ పోర్టల్ డెలవరీ చేసేవారి కోసమే ప్రత్యేకంగా సంక్షేమ మండలి ఏర్పాటు చేయదలచినట్లు వివరించారు. రాష్ట్ర కేబినెట్ మంత్రులందరితో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు తదితర ముఖ్యనాయకులంతా ఢిల్లీలోనే ఉన్నారు.

కూల్.. కూల్..!

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలతో తల్లడిల్లుతున్న రాష్ట్ర ప్రజలకు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకునేలా చల్లదనం కలిసివచ్చింది. గురువారం మధ్యాహ్నం బెంగళూరు నగరంతో పాటు దక్షిణ ప్రాంత జిల్లాలు మైసూరు, మండ్యతో పాటు హాసన్, శివమొగ్గ, తీర ప్రాంత జిల్లాల వ్యాప్తంగా వర్షం కురిసింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న సందర్భంలో వరుణుడు కరుణించినట్లు అయ్యింది. మధ్యాహ్నం 12గంటల నుంచి ప్రాంతాల వారీగా రెండుగంటల దాకా వర్షం కురిసింది. మధ్యాహ్నం కురిసిన వానకు రోడ్లపై ద్విచక్రవాహనదారులు, నడిచి వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. ప్రధానరోడ్లలో నీరు నిల్వ ఉండటంతో సమస్య ఏర్పడింది. రాజాజీనగర్‌లో ఓ చెట్టు విరిగి పడి రెండుకార్లు ధ్వంసమయ్యాయి. నగరమంతటా వర్షంతో ప్రజలు రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. విధానసౌధలో పనులు చేస్తున్న కార్మికులు ఏమాత్రం లెక్కచేయకుండా కొనసాగించారు.



బెంగళూరులో వర్షంలో గొడుగులతో యువతులు



జలమయమైన నగర వీధులు





రాజాజీనగర్‌లో చెట్టు కూలి దెబ్బ తిన్న కారు



ఇబ్బంది పడుతున్న వాహనదారులు



విధానసౌధ సమీపంలో కూలిపోయిన షెడ్డు





ఆన్‌లైన్‌లోనే..!

వైసీపీ పాపం.. రైతులకు శాపం..
సాగులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో భూముల తొలగింపు
కొత్త ప్రభుత్వంలో పరిష్కారానికి చర్యలు
రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ
వంద రోజులైనా పరిష్కారం ఏదీ?
అసైన్మెంట్ కమిటీ పేరుతో కాలయాపన

కూడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆ భూములు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించాలంటూ బ్యాంకులు ఒత్తిడి తెస్తున్నాయి. భూములు కోల్పోయి, రుణాలు తిరిగి చెల్లించలేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది ఏర్పాటైన కొత్త ప్రభుత్వం.. వైసీపీ భూఅరాచకాలపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు.

మండలంలో 202 మంది రైతుల భూములను ఆన్‌లైన్ నుంచి అన్యాయంగా తొలగించారని అధికారులు క్షేత్రస్థాయి విచారణ ద్వారా తేల్చారు. వాటికి వంద రోజుల్లోగా అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంది. అర్జీలు స్వీకరించి, వంద రోజులు దాటినా నేటికీ అర్హులుగా గుర్తించిన రైతుల భూములను ఆన్‌లైన్ చేయలేదు. అదేమిటంటే అసైన్మెంట్ కమిటీ అంటూ కాలయాపన చేస్తున్నారు. దీనిపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంకా ఎన్నాళ్లు అధికారుల చుట్టూ తిరగాలనీ, ఎన్నేళ్లు వేచి చూడాలని వాపోతున్నారు.

ఏకపక్షంగా తొలగింపు

కాంగ్రెస్ హయాంలో భూమిలేని పేదలను గుర్తించి, అసైన్మెంట్ కమిటీ ఆమోదంతో భూములు పంచి, పాసుపుస్తకాలు సైతం మంజూరు చేశారు. అప్పట్నుంచి ఆ భూములను ఏళ్లుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో 2020లో కనీస విచారణ కూడా చేయకుండా అసైన్మెంట్ కమిటీ పంచిన భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. తమ భూములను తిరిగి ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.., ఆందోళనలు చేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో గతేడాది కొలువుదీరిన కొత్త ప్రభుత్వం భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల ద్వారా అర్జీలు స్వీకరించి, వంద రోజుల్లో పరిష్కారం చూపాలని ఆదేశించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారులు 242 అర్జీలను స్వీకరించారు. వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి 202 మంది రైతులను అర్హులుగా గుర్తించి, నివేదికలు తయారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపారు. అర్జీలు ఇచ్చి వంద రోజులు దాటినా భూసమస్యలు పరిష్కారం కాలేదు. నేటికీ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించలేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.


ఉదిరిపికొండ గ్రామం వద్ద చీనీ సాగు చేస్తున్న భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

రుణాలు చెల్లించలేక..

భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు కొత్త సమస్య వచ్చిపడింది. వాటిపై తీసుకున్న రుణాలు మొత్తం చెల్లించాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని వారు వాపోతున్నారు. అర్హులను తేల్చని వారి భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ తీర్మానం అవసరమని అధికారులు చెబుతున్నారు. కమిటీ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఎప్పుడు ఆన్‌లైన్ చేస్తారోనని రైతులు నిట్టూరుస్తున్నారు.


ఉదిరిపికొండ గ్రామం వద్ద వేరుశనగ సాగు భూమిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్

ఎన్నిసార్లు తిరిగినా...



నా భార్య మునెమ్మ పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. కాంగ్రెస్ పాలనలో నాలుగో విడత అసైన్మెంట్ కమిటీలో పట్టాతోపాటు పాసుపుస్తకం ఇచ్చారు. అలాంటి భూమిని విచారణ చేయకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. మూడు నెలల క్రితం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాం. వంద రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇంతవరకు కాలేదు.

\- రామాంజనేయులు, రైతు, కూడేరు

నోటీసులు కూడా ఇవ్వకుండా..



నా పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో చీనీ సాగు చేస్తున్నాం. ఏళ్లుగా సాగులో ఉన్న భూమిని నోటీసులు కూడా ఇవ్వకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. బ్యాంకులో తీసుకున్న రుణాన్ని బయటి వ్యక్తుల వద్ద అప్పు చేసి, చెల్లించాం. గ్రామంలో పలుసార్లు జరిగిన సభల్లో అర్జీలు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని వేడుకుంటున్నా.

\- పార్వతి, మహిళారైతు, ఉదిరిపికొండ గ్రామం

అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాకే..



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ చేశాం. సాగులో ఉండి ఆన్‌లైన్‌లో తొలగించిన భూములను గుర్తించి, నివేదికలు తయారు చేశాం. అర్హులైన రైతుల భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాలి. ప్రభుత్వం కమిటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే అర్హులైన రైతుల భూములు ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తాం.

\- మహబూబ్ బాషా, తహసీల్దార్, కూడేరు

పెన్షన్ రూల్స్ సవరణను వెంటనే విరమించాలి

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్


బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ప్రెస్ క్లబ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెన్షన్ రూల్స్ సవరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించాలని ఆల్ ఇండియా బీఎస్ ఎన్ ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ అండ్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించా రు. ఈకార్యక్రమానికి ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ 8వ వేతన సవరణ సంఘంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల రివిజన్ అంశం పాయింట్ ఆఫ్ రిఫరెన్స్‌గా చేర్చాలన్నారు. ఈ పెన్షన్ రూల్స్ వల్ల భవిష్యత్తులో పే కమిషన్ల వల్ల వచ్చే పెన్షన్ రివిజన్ పాత పెన్షనర్స్‌కు వర్తించకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సవరణను దేశ వ్యాప్తంగా వ్యతిరేకించినట్లు వెల్లడించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబుళు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, సర్కిల్ సహాయ కార్యదర్శి సుభాన్, బ్రాంచ్ కార్యదర్శి బాలరంగయ్య, కుమార్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, జిల్లా కార్యదర్శి జయరామప్ప వివిధ శాఖల పెన్షనర్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల సబ్సిడీ ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు అందాయి. మూడు రకాల విత్తనాలకు 50 శాతం సబ్సిడీని వర్తింజేశారు. జీలుగ క్వింటా పూర్తి ధర రూ.12300లు కాగా ఇందులో 50 శాతం సబ్సిడీపోను రైతు రూ.6150లుగా చెల్లించాల్సి ఉంటుంది. జనుము క్వింటా పూర్తి ధర రూ.10900లు కాగా ఇందులో సబ్సిడీపోను రైతు రూ.5450లు చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా ధర రూ.18000లు కాగా సబ్సిడీపోను రైతు రూ.9వేలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాకు ఈ సారి జీలుగ 190 క్వింటాళ్లు, పిల్లిపెసర 15 క్వింటాళ్లు, జనుము 2 క్వింటాళ్లు కేటాయించారు.

తోపు కుట్రలకు బలికావద్దు

● గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత వినతి

అనంతపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో తోపుదుర్తి సోదరులు మళ్లీ కక్షలు రేపాలని చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మద్దలచెరువు గంగుల కుటుంబం, కనుముక్కల సానె కుటుంబాన్ని గొడవల్లోకి లాగుతున్నారని ఆరోపించారు. వారి కుట్రలకు బలికావొద్దని గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లికి జగన్ వస్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా

(మిగతా 6లో....)

స్పందించారు. ఫ్యాక్షన్ కారణంగా తన భర్త పరిటాల రవి, మామ, మరిదిని కోల్పోయామని, సానె కుటుంబంలో వారి తండ్రి, సోదరులను కోల్పోయి ఉమ ఒంటరిగా మారిపోయారని అన్నారు. గంగుల కుటుంబంలోనూ భానుమతి ఒంటరిగా మిగిలారని అన్నారు. ఫ్యాక్షన్ కారణంగా కుటుంబ సభ్యులను కోల్పోయి, పిల్లలను పోషించడానికి, చదివించేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని అన్నారు. ఒక పూట తినీ తినక నాలుగు గోడల మధ్య ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. 'మీ కుటుంబంలో ఎవరినైనా కోల్పోతే ఇలాంటి బాధలు ఎలా ఉంటాయో తెలుస్తాయి' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి అన్నారు. ప్రశాంతంగా ఉన్న సమయంలో మళ్లీ గంగుల, సానె కుటుంబాలను మధ్యలోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల, సానె కుటుంబాల మీద తోపుదుర్తి సోదరులకు అంత ప్రేమే ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఏదైనా ఒక మంచి పదవి ఎందుకు ఇప్పించలేదని నిలదీశారు. ఇప్పుడైనా ఆ రెండు కుటుంబాలకు న్యాయం చేయగలరా..? ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించగలరా అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని నిలదీశారు. చేతనైతే 2029 ఎన్నికల్లో రాప్తాడు టిక్కెట్‌ను గంగుల లేదా సానె కుటుంబాలకు ఇప్పించాలని సూచించారు. కక్షలకు వారు, పదవులకు మీరా అని నిలదీశారు. మహిళలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పరిటాల కుటుంబం మొదటి నుంచి రెడ్డి సామాజికవర్గంతో సఖ్యతగా ఉందని, వారికి పరిటాల కుటుంబం వ్యతిరేకమన్నట్లు తోపు సోదరులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన భర్త హయాంలోనే రెడ్డి కులస్థులతో తమ కుటుంబానికి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. '2019 ఎన్నికలకు ముందు మీ గెలుపు కోసం రెడ్డి సామాజికవర్గ ప్రజలు సొంత ఆస్తులు అమ్మి పనిచేశారు. అధికారంలోకి వచ్చాక వారినే ఇబ్బంది పెట్టారు. అందుకే వారు మీకు దూరమయ్యారు. మళ్లీ దగ్గర చేసుకునేందుకు పరిటాల కుటుంబాన్ని వాడుకుంటున్నారు' అని విమర్శించారు. వారిని నమ్మవద్దని రెడ్డి సామాజికవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తోపుదుర్తి చందు హైదరాబాదు నుంచి వచ్చేటప్పుడు కొందరు రెడ్డి సామాజికవర్గ పిల్లలకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, మద్యం తాపించి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా ఏవైనా గొడవలు జరిగితే పరిటాల కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలకు తోపుదుర్తి చందును తుక్కుతుక్కుగా కొట్టాల్సిందని విరుచుకుపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తోపుదుర్తి చందు తిట్టిన వీడియోలను ఆమె మీడియా ఎదుట ప్రదర్శించారు. 'మొద్దుశీను బతికిఉంటే నువ్వు పాదయాత్ర చేసేవాడివా?' అంటూ చందు చేసిన వ్యాఖ్యలను చూపించారు. అప్పట్లో దూషించి.. ఇప్పుడు చంద్రబాబు గారు... లోకేష్ గారని మర్యాద ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో టీడీపీవారు ఇలాంటి మాటలు మాట్లాడి ఉండే మీరు ఏం చేసేవారో ప్రజలందరికి తెలుసునని అన్నారు.

కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరు..?



తోపు సోదరులు ఎప్పుడూ టీవీ బాంబు గురించే ప్రస్తావిస్తుంటారని, కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరని పరిటాల సునీత నిలదీశారు. కారు బాంబుతో 24 మందిని పొట్టనపెట్టుకున్నది వాస్తవం కాదా ప్రశ్నించారు. అందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని, ఈ సంఘటనలో తోపు సోదరులు జైలుకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. పాపంపేటలో ఇళ్ల కూల్చివేత వెనుక పరిటాల కుటుంబం హస్తం ఉందని ప్రకాష్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆమె ఘాటుగా స్పందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎక్కడా రాజకీయ నాయకుల ప్రమేయం లేదని అన్నారు. ఇళ్ల కూల్చివేతను మొదట అడ్డుకున్నది తమ పార్టీ నాయకులేనని అన్నారు. ఆ సమయంలో ప్రకాష్‌రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. మూడు రోజుల తరువాత రాజకీయం చేశారని మండిపడ్డారు. తాను రూ.8 కోట్లు తీసుకుని అక్కడ భవనాలు కట్టాలని చూస్తున్నానని ఆరోపించారని, దమ్ముంటే నిరూపించాలని ఆమె సవాల్ విసిరారు. జేసీబీలకు రాప్తాడు నియోజకవర్గ ప్రజలు భయపడరని, తోపుదుర్తి సోదరులు మాత్రమే భయపడతారని అన్నారు. తాను కూల్చాలనుకుంటే హైదరాబాదులోని తోపుదుర్తి సోదరుల బంగ్లాను కూలుస్తానని అన్నారు. ఇల్లు లేదు.. అద్దె ఇంట్లో ఉన్నామంటూ దొంగ ఏడుపులు ఏడ్చే ప్రకాష్‌రెడ్డి సోదరులకు హైదరాబాదులో భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా వ్యవహరించే పద్ధతి పరిటాల కుటుంబానిది కాదని అన్నారు. పరిటాల కుటుంబం ఇచ్చే కుటుంబమే తప్ప.. తీసుకునే కుటుంబం కాదని ఆమె స్పష్టం చేశారు.

ఆపే శక్తి మీకు లేదు..

'రామగిరి ఎంపీపీ స్థానాన్ని మేము కావాలనుకుంటే ఆపే శక్తి మీకు లేదు' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి పరిటాల సునీత అన్నారు. అప్పట్లో చంద్రబాబు వద్దన్నందుకే తాము పోటీ చేయలేదని, లేదంటే ఆరు మండలాల ఎంపీపీ స్థానాలను గెలిచేవారమని అన్నారు. 'మీరు హైదరాబాదులో విలాసవంతంగా ఉండాలి. గొడవలకు బీసీలు వెళ్లాలా..?' అని నిలదీశారు. రాష్ట్రంలో అన్ని ఎంపీపీ స్థానాలను గెలిచామని గొప్పలు పోయే జగన్.. రామగిరిలో బలమున్నా గెలిపించుకోలేని దద్దమ్మ ఉన్నాడని గుర్తిస్తే మంచిదని అన్నారు. 'పాపిరెడ్డి పల్లిలో మీ పార్టీ నేత చనిపోతే ఎవరైనా పరామర్శించారా?' అని ప్రకాష్‌రెడ్డి అని ఆమె ప్రశ్నించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ఎస్ఐ సుధాకర్‌యాదవ్ విధులు నిర్వర్తిస్తే ఆయనను కించపరుస్తున్నారని, తప్పు చేసిన వారిని స్టేషన్‌కు పిలిపిస్తే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారా అని మండిపడ్డారు. ఎంపీటీసీల చేత తనతో ఫోన్‌లో మాట్లాడించారని ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చేతనైతే నిరూపించాలని సవాలు విసిరారు.

నేడు రాష్ట్రస్థాయి సదస్సు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శుక్రవారం అనంతపురం లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల నుంచి డీఆర్‌డీఏ పీడీలు, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్ ఉద్యోగులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు సదస్సుల్లో పాల్గొంటార న్నారు.

అన్నదాతల్లో ఆశలు..!


2018లో కాలువలో ప్రవహిస్తున్న నీరు

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
నీరు వదల్లేదు.. నిధులూ ఇవ్వలేదు..
కొత్త ప్రభుత్వం నిధుల కేటాయింపుతో చిగురించిన ఆశలు

టీడీపీ పాలనలో మాల్యం బ్రాంచి కాలువ నిర్మాణం.. అప్పట్లో నీరు కూడా విడుదల


కాలువలో పెరిగిన ముళ్ల పొదలు

కణేకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతల ఆశలపై నీళ్లు కుమ్మరించారు. మాల్యం బ్రాంచి కాలువే అందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో కాలువను నిర్మించారు. 2018లో నీరు కూడా వదిలారు. కాలువ పక్కనే పొలాలున్న రైతులు పంటలు పండించుకున్నారు. పిల్ల కాలువలు తవ్వి పొలాలకు నీరందంచేందుకు చర్యలు చేపట్టారు. ఇంతలోనే 2019 ఎన్నికలొచ్చాయి. అప్పట్లో అధికారం చేపట్టిన వైసీపీ.. కాలువ పనులను అటకెక్కించింది. ఐదేళ్లలో పైసా కూడా నిధులివ్వలేదు. నీరు కూడా విడుదల చేయలేదు. తద్వారా రైతన్న ఆశలకు గండికొట్టారు. పిల్లకాలువల కోసం సేకరించిన భూములకు సంబంధించి కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో ఆరేళ్లుగా రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం హంద్రీనీవాకు నిధుల కేటాయింపుతో మళ్లీ అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. పిల్ల కాలువల నిర్మాణం చేపట్టి, పొలాలకు నీరు వదులుతారని రైతులు ఆనందపడుతున్నారు.

అప్పట్లో నీరు విడుదల

మండలంలోని హనకనహాళ్, సొల్లాపురం, మాల్యం, కళేకుర్తి, తుంబిగనూరు గ్రామాలకు సాగునీరు అందించేందుకు టీడీపీ హయాంలో కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) 36ఏ ప్యాకేజీ కింద మాల్యం బ్రాంచ్ కెనాల్ 21 కిలోమీటర్లు తవ్వారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలువకు నీరిచ్చేలా నిర్ణయించారు. ప్రధాన కాలువ నిర్మాణం 2018లో పూర్తయింది. దీని కింద దాదాపు 17 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అప్పట్లో కళేకుర్తి చెరువుతోపాటు కాలువ పక్కన పొలాలున్న రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద వప్పుశనగ పంట మాత్రమే సాగు చేసుకునే ఈ ప్రాంత రైతులు.. అప్పట్లో హంద్రీనీవా నీరు రావడంతో సంబరపడ్డారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. పిల్లకాలువలు తవ్వి, పొలాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ దిశగా అప్పట్లో చర్యలు చేపట్టారు. ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల మేర పరిహారంగా ప్రకటించారు. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి, పిల్లకాలువలకు అవసరమైన దాదాపు 1500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో అనేక మందికి పరిహారం డబ్బు కూడా జమ చేశారు. మరో రూ.50 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండేది.

వైసీపీ నిర్లక్ష్యం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. మాల్యం బ్రాంచి కాలువను పూర్తిగా విస్మరించింది. కాలువకు నీరివ్వలేదు. దీంతో కాలువలో ముళ్లకంపలు పెరిగిపోయాయి. ప్రధాన, పిల్ల కాలువల పనులు ముందుకు కదలలేదు. కనీసం పిల్లకాలువలకు భూములిచ్చిన రైతులకు పరిహారం సొమ్ము కూడా ఇవ్వలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పలేదు.

మళ్లీ ఆశలు

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మాల్యం బ్రాంచి కెనాల్ పరిధిలోని రైతుల ఆశలు చిగురించాయి. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా పునరుద్ధరణకు రూ.రెండు వేల కోట్లు కేటాయించగా.. అందులో తమ ప్యాకేజీ డబ్బు కూడా వస్తాయన్న ఆశతో రైతులు ఉన్నారు. కాలువ పనులు పూర్తై నీరు వస్తుందని సంబరపడుతున్నారు. మళ్లీ పంటలు సాగుచేసుకునే రోజు వస్తుందని ఎదురుచూస్తున్నారు.

మోటార్లు పెట్టి నీటిని తోడుకున్నాం



హంద్రీనీవా ప్రధాన కాలువ పక్కనే మాకు 20 ఎకరాల పొలం ఉంది. 2018-19 సంవత్సరంలో కాలువకు వదిలిన నీటిని మోటార్ల ద్వారా తోడుకుని, పంటలు పండించుకున్నాం. ఆ తర్వాత నీరు వదలకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

\-హరి, రైతు, మాల్యం

బకాయిలు చెల్లించాలి



హంద్రీనీవా పిల్ల కాలువలకు రెండెకరాలు ఇచ్చా. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షల మేర పరిహారం చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. ఆరేళ్లు కావస్తున్నా సొమ్ము అందలేదు. ఇప్పటికైనా రైతులకు బకాయిలు చెల్లిస్తే బాగుంటుంది.

\-రజాక్, రైతు, మాల్యం

నూతన ప్రభుత్వంపై ఆశలు



వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నూతన ప్రభుత్వం ఆశలు రేపుతోంది. హంద్రీనీవాపై ఇప్పటికే మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పలుమార్లు అధికారులతో చర్చలు జరిపారు. కాలువకు నీరు వదలితే పంటలు పండించుకుంటాం.

\- అశోక్, రైతు, మాల్యం

త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం

త్వరలోనే హంద్రీనీవా కాలువకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేసి, నీరు విడుదల చేస్తాం. బడ్జెట్‌లో హంద్రీనీవాకు సంబంధించి రైతులకు బకాయి పడ్డ భూసేకరణ సొమ్ము అందించడంతోపాటు కాలువ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు కూడా పూర్తి చేసే అవకాశం ఉంది.

\-శ్రీనివాసనాయక్, హంద్రీనీవా ఈఈ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంఛ్...

అన్నమయ్య (వర్ధంతి)



పదకవితా పితామహుడైన అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు 1408 మే 22న కడప జిల్లా తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. గొప్ప వైష్ణవభక్తుడు. తిరుమల వేంకటేశ్వరస్వామి, అహోబిలం నరసింహస్వామి ఇతర దేవతలను కీర్తిస్తూ 32వేలకుపైగా కీర్తనలు రచించారు. ఆయన పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికుని ఉంటాయి. చందమామ రావే జాబిల్లి రావే..., జో అచ్యుతానంద జోజో ముకుంద వంటివి ఎంతో పేరొందాయి. 1503 ఏప్రిల్ 4న పరమపదించారు.

మార్టిన్ లూథర్ కింగ్ (వర్ధంతి)



నోబెల్ పురస్కార గ్రహీత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 1929 జనవరి 15న అమెరికా దేశం జార్జియా రాష్ట్రం అట్లాంటాలో జన్మించారు. సివిల్ రైట్స్ ఉద్యమ నాయకుడు. బాప్టిస్ట్ మినిస్టర్‌గా వ్యవహరించారు. మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని అహింసా మార్గంలో సాగారు. సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్‌కు మొదటి అధ్యక్షుడిగా వ్యవహరించారు. మంచి వక్తగా, సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. 39వ యేట 1968 ఏప్రిల్ 4న హత్యకు గురయ్యారు. మరణానంతరం ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం గౌరవం ప్రకటించారు. అమెరికాలో ఆయన గౌరవార్థం జనవరి మూడో సోమవారాన్ని మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ డేగా ఆచరిస్తున్నారు.

మొహమ్మద్ కులీ కుతుబ్ షా (జయంతి)



హైదరాబాద్ నగర నిర్మాతగా పేరొందిన కుతుబ్ షాహీ వంశం ఐదో సుల్తాన్ అయిన మొహమ్మద్ కులీ కుతుబ్ షా 1565 ఏప్రిల్ 4న జన్మించారు. చారిత్రాత్మక చార్మినార్‌ను నిర్మించింది ఆయనే. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ, తెలుగు భాషలలో పాండిత్యం గలవాడు. ఉర్దూ సాహిత్య జగతిలో దీవాన్ గల మొదటి సుల్తాన్. ఇతడి దీవాన్ పేరు ఎకుల్లియాత్ ఎ కుతుబ్ షాహీ. ఆయన తెలుగు రచనలూ, కవితలు కూడా చేశాడు అయితే అందుబాటులో ఏవీ లేకపోవడం దురదృష్టకరం. 1612 జనవరి 11న కన్నుమూశారు.

పండిట్ మఖన్‌లాల్ చతుర్వేది (జయంతి)



పండిట్ మఖన్‌లాల్ చతుర్వేది 1889 ఏప్రిల్ 4న మధ్యప్రదేశ్ రాష్ట్రం హోషంగాబాద్ జిల్లా బాబాయ్ గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, వ్యాసకర్త, నాటక రచయిత, జర్నలిస్ట్. దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయ పోరాటంలో పాల్గొన్నందుకు ఛాయావాద్‌కు హిందీ సాహిత్యంలో ఎంతో కృషి చేశారు. హిందీలో తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 1963లో పద్మభూషణ్ గౌరవాన్ని అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుడిగా వ్యవహరించారు. ప్రభా, ప్రతాప్, కర్మవీర్ జాతీయవాద పత్రికలకు ఎడిటర్‌గా వ్యవహరించి జైలుపాలయ్యారు. 1968 జనవరి 30న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ మధ్యప్రదేశ్‌లో యూనివర్సిటీకి పేరు పెట్టారు.

సాగు నీటి కోసం ఎమ్మెల్యే పాదయాత్ర

● పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా : అధికారులపై మండిపడ్డ కరెమ్మ నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపూర్ కుడి కాలువ పరిధిలో పంటలు ఎండుతుండడాన్ని అధికారులు తేలికగా తీసుకున్నారంటు దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ ఆరోపించారు. కేబీజేఎన్ఎల్ అధికారులు ఇస్తున్న తప్పుడు సమాచారంతోనే రైతులకు సమస్య తలెత్తిందని అధికారులు ప్రభుత్వాన్ని సహితం తప్పుదోహ పట్టిస్తున్నారంటు ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారుల తీరును నిరశిస్తు సాగునీటి కోసం ఎమ్మెల్యే గురువారం దేవదుర్గ తాలూకా గబ్బూరు నుంచి సాథ్ మైల్ క్రాస్ వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సాథ్‌మైల్ క్రాస్ గాయత్రి ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడిన ఎమ్మెల్యే, లక్షల రూపాయిలు ఖర్చు చేసి పంటలు సాగు చేసుకున్న రైతులు పంట చివరి దశలో నీరు లేచిపోవడంతో లక్షల్లో నష్టపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. దీంతో రైతులు తీవ్ర మనోవేదకు గురవుతున్నారని వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. అధికారులకు విషయ తీవ్రతను తెలిపేందుకే తాను పాదయాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా మరోవైపు సాగునీటి కోసం రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరంతర దీక్ష ప్రారంభించారు. రైతు సంఘాల సంయుక్త కమిటీ నాయకులు ప్రభాకర్ పాటీల్ ఆధ్వర్యంలో గురువారం సాగునీటి శాఖ కార్యాలయం వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రభాకర్ పాటీల్, పంట చివరి దశలో నీరు కాలువకు నిలిచిపోవడం వల్ల రైతులు అప్పుల పాలైయ్యే దుస్థితి తలెత్తిందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి పలు సార్లు తెచ్చినా స్పందించడం లేదని దీంతో అనివార్యంగా తాము నిరవధిక దీక్ష ప్రారంభించినట్లు తెలిపారు.

సాగు నీరివ్వకుంటే పోరాటం ఉధృతం:జిల్లాలోని రైతుల పంటలు కాపాడేందుకు ఎన్ఆర్‌బీసీ కాలువకు ఈ నెల 15వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ డిమాండ్ చేశారు. 15వ తేదీ వరకు నీటి విడుదల జరగకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సాగు నీటి విడుదల కోరుతూ దేవదుర్గ తాలూకా గబ్బూరు నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే గురువారం నగర సమీపం సాథ్‌మైల్ క్రాస్ వద్ద గాయత్రి ఆలయం వద్ద విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాదయాత్రలో పెద్ద సంఖ్యలో రైతులు భాగస్వాములైయ్యారని వీరంత ఉత్సహంతో కాకున్నా ఆవేదనతో వచ్చిన వారే అన్న విషయాన్ని అధికారులు గమనించాలన్నారు. కాగా నీటి పారుదల శాఖ అధికారుల తీరు సమంజసంగా లేదన్న ఎమ్మెల్యే, గత నెలలో తీసుకున్న నీటి సలహ సమితి నిర్ణయం మేరకు ఈ నెల 10వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామన్న అధికారులు ఒకటి రెండు రోజులు నామ మాత్రంగా నీరు విడుదల చేసి ఎవ్వరికి సమాచారం ఇవ్వకుండా నీటిని నిలిపివేయడం గర్హనీయమన్నారు. పైగా అధికారులు ప్రభుత్వానికి అందరూ తల ఉంచాలని అనే రీతిలో వ్యాఖ్యలు చేయడం వారి తెలివితక్కుతనమన్నారు. అధికారులు ప్రభుత్వానికి తలవంచితే తప్పేమి లేదని రైతులు తలుంచాలని అధికారులు కోరుకోవడం దౌర్భాగ్యమన్నారు. ఇలాంటి అధికారులు తమ వైఖరి మార్చుకుని రైతులకు, ప్రజలకు ప్రభుత్వం-పాలకులు అధికారులే తలవంచాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కాగా మాజీ ప్రధాని దేవేగౌడ సీఎంగా ఉన్న కాలంలో జిల్లా రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఎన్ఆర్‌బీసీ కాలువను ఏర్పాటు చేశారని ప్రస్తుత ప్రభుత్వం అధికారులు నీటిని విడుదల చేస్తే చాలని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు

సాహితీవేత్త డాక్టర్ పీవీ నారాయణ కన్నుమూత



పీవీ నారాయణ(ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకులు డాక్టర్ పీవీ నారాయణ(82) వయోభారం ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. జయనగర్‌లోని నివాసంలోనే ఆయన తుదిశ్వాస వీడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వచనసాహిత్య అధ్యయనంతో పాటు విమర్శలు, పరిశోధనాత్మక కథనాలు, నవలలు రచించారు. కన్నడ అధ్యాపకుడిగా కొనసాగుతూనే సాహిత్య సేవ కొనసాగించారు. భాషాపరమైన ఉద్యమాలలోను పోరాటాలు చేశారు. నారాయణ మృతి పట్ల సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సంతాప సందేశాన్ని పంపారు. మధ్యాహ్నం దాకా జయనగర్‌లోని నివాసం వద్ద అభిమానులు, శిష్యుల సందర్శనలకు పార్థివ దేహాన్ని ఉంచారు. సాయంత్రం బనశంకరిలోని స్మశాన వాటికలో అంత్యక్రియాలు జరిపారు.

చేళూరులో భారీ వర్షం



చేళూరులో కురుస్తున్న వర్షం

చేళూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం సుమారు గంటకుపైగా వర్షం కురిసింది. కొన్నిరోజులుగా ఎండవేడిమిని భరించిన ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించినట్టయ్యింది. ఒకమోస్తరు వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లు శుభ్రం అయ్యాయి. ఉగాది తర్వాత కురిసిన వర్షంతో పంటలకు కొంత మేలు చేకూరనుందని పలువురు అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ప్రజలకు, పశువులు తాగునీటి ఎద్దడి తీరనుందని అధికారులు అంటున్నారు.



అరటితోటలో నిలిచిన వర్షపు నీరు


నీట మునిగిన పంటలు

కంప్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉభయ జిల్లాల్లో బుధవారం రాత్రి రెండు జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. అకాల వర్షాల వల్ల మిరప రైతులు ఇబ్బందులకు గురయ్యారు. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. గ్రామాల్లో మార్కెట్‌కు తరలించేందుకు సిద్దంగా వుంచిన మిరప పంట వర్షానికి తడిసిపోయి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోస్పేటలో పలు చోట్ల భారీ వర్షం కురవడంతో పొలాల్లో నీరు నిలిచి పంటలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది మొదట్లోనే భారీ వర్షాలు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఉరుములు, మెరుపులతో వర్షాలు వచ్చి పంటను కూడా పూర్తిగా నష్టం వాటిల్లాయి. హోసూరు వద్ద కురిసిన వర్షానికి పంటలో నీరు నిలిచిపోయి పంటలు నష్టపోయామని రైతులు వాపోయారు.

ఘనంగా జపనీస్ డే

ఆకట్టుకున్న బంగారు వంతెన నాటిక







పుట్టపర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జపనీస్ డే వేడుకలను గురువారం సాయికుల్వంతు సభామంటపంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జపనీస్ ప్రతినిధి జపాన్‌లో చేపట్టిన సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. సత్యసాయి బోధనలు, సేవలు తమకు మార్గదర్శకాలని, సత్యసాయిబాటలో పయనిస్తూ సామాజికసేవలను కొనసాగిస్తున్నామన్నారు. సత్యసాయి ప్రేమతత్వం శాంతి జీవనానికి మార్గదర్శకమన్నారు. అనంతరం జపాన్ యువత బంగారు వంతెన పేరిట నాటికను ప్రదర్శించారు. నాటికలో రావణ బ్రహ్మ శివభక్తిని తెలియజేశారు. రామాయణంలోని పలు ఘట్టాలను వివరించారు. భక్తి గీతాలాపన చేపట్టారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

● ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య ● రూ.5 లక్షలు సుపారీ ఇచ్చిన ప్రియుడు

● పరారీలో నలుగురు నిందితులు ● వీడిన హెల్త్‌సూపర్‌వైజర్ హత్య మిస్టరీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడన్న కారణంతో ప్రియుడితో కలిసి భర్తను హతమార్పించా భార్య. ఈనెల 1వ తేదీన అర్ధరాత్రి మహబూబాబాద్ జిల్లా అయోధ్య గ్రామ పరిధిలోని భజనతండా సమీపంలో ఓ హెల్త్‌సూపర్ వైజర్ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. త్వరితగతిన పోలీసులు ఈ కేసును చేదించగా.. గురువారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని జగదీష్ కాలనీకి చెందిన తాటి పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు దంతాలపల్లిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుండగా.. భార్య స్వప్న, పిల్లలు భద్రాచలం జగదీష్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే స్వప్నకు భద్రాచలంలో ఉంటూ ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవోమంగి మండలం జడ్డంగి గ్రామానికి చెందిన సోర్లాం వెంకట విద్యాసాగర్‌కు మధ్య తొమ్మిదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. అప్పటికే తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న ఆలోచలో ఉన్న ఆ ఇద్దరు.. పార్థసారథిని ఎప్పుడికైనా అడ్డుతొలగించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులకు రూ.5లక్షలు సుపారీ ఇచ్చి హత్య చేయించేందుకు పన్నాగం పన్నారు. ఈ క్రమంలోనే రంజాన్, ఉగాది పండుగల సెలవులు రావడంతో పార్థసారథి మార్చి 28న స్వగ్రామమైన భద్రాచలం వెళ్లి.. సెలవుల అనంతరం విధుల్లో చేరేందుకు మార్చి 31న సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి బయలు దేరాడు. అప్పటికే హతమార్చేందుకు అనువైన సమయంలో కోసం ఎదురుచూస్తున్న స్వప్న పార్థసారథి దంతాలపల్లికి బయలు దేరిన విషయాన్ని వెంకట విద్యాసాగర్‌కి చెప్పింది. దాంతో పార్థసారథిని హతమార్చేందుకు ఇదే సరైన సమయమని భావించి.. తాము ఒప్పందం కుదుర్చుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన తెలుగూరి వినయ్‌కుమార్, శివశంకర్, ఏపీలోని రాష్ట్రం అల్లూరిసీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రానికి చెందిన వంశీ, రాజమండ్రి జిల్లా జడ్డంగికి చెందిన కుసం లవరాజ్‌కు విషయం చేరవేశారు. దీంతో వారు ఓ కారులో పార్థసారథి వెళ్లే దారిలోని భజనతండ శివారున కాపుకాశారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న పార్థసారథిని అడ్డగించి, ఇనుపరాడ్లతో కొట్టే ప్రయత్నం చేయగా.. తన ద్విచక్రవాహన్ని కిందపడేసి పక్కనే ఉన్న మిర్చి తోటలోకి పరుగు తీశాడు. అయినా వారు వెంటపటి పార్థసారథిపై రాడ్లతో తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం నిందితులు నెల్లికుదురు, తొర్రూరు మీదుగా ఖమ్మం చేరుకుని.. అక్కడ్నుంచి భద్రాచలం వెళ్లి వెంకట విద్యాసాగర్ వద్ద క్రెడిట్‌కార్డును తీసుకుని పరారయ్యారు. మృతుడి సోదరి హేమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పార్థసారథి భార్య స్వప్న, ఆమె ప్రియుడు సోర్లాం వెంకట విద్యాసాగర్‌ను విచారించగా 2016లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోర్లాం వెంకట విద్యాసాగర్‌కు స్వప్నతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసినట్లు తెలిసింది. ఈ విషయం పార్థసారథికి తెలియడంతో అనేకమార్లు దంపతుల మధ్య గొడవలయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు పెట్టి సమస్యను పరిష్కరించుకున్నారు. అయినా స్వప్న తన తీరు మార్చుకోలేదు. గతంలో ఓ సారి భద్రాచలం బీపీఎల్‌లో హెల్త్‌సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సమయంలో కూడా పార్థసారథిపై స్వప్న ప్రియుడు సోర్లాం వెంకట విద్యాసాగర్ హత్య చేయించేందుకు ప్రయత్నించినట్టు వివరించారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని తన భర్తను ప్రియుడితో హత్య చేయించినట్టు అంగీకరించచారని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. ఇక పార్థసారథి భార్య స్వప్న, ఆమె ప్రియుడు సోర్లాం వెంకటవిద్యాసాగర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పార్థసారథిని హత్య చేసిన నలుగురు నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసును వేగంగా ఛేదించిన మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య ఎస్సై దీపికరెడ్డి, బయ్యారం సీఐ రవికుమార్, గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సీ సీఐ చంద్రమౌళి, ఎస్సైలు హత్తిరాం, గిరిధర్‌రెడ్డి, ఐటీకోర్, క్లూజ్‌టీం సిబ్బందిని అభినందించి, రివార్డులను అందించారు. అయితే హత్య అనంతరం నిందితులు ఏపీలోని రాజమండ్రి, అన్నవరం ప్రాంతాల వైపు పరారయ్యారని తెలుస్తోంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

ప్రవీణ్ కేసును సీబీఐకి అప్పగించాలి

●కల్వారి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌వెస్లి



ఆందోళనలో అసోసియేషన్ నాయకులు

రాయచూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కల్వారి పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జాన్‌వెస్లి డిమాండ్ చేశారు. ప్రవీణ్ పగడాల మృతిని నిరశిస్తు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వందల సంఖ్యలో తరలివచ్చిన పాస్టర్‌లు, క్రిష్టియన్లు స్థానిక రైల్వే స్టేషన్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రవీణ్ పగడాల హత్యను సీబీఐకి అప్పగించాలంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జాన్‌వెస్లి, హైదరాబాద్ నుంచి రాజమండ్రికి బైక్ పై వెళుతున్న ప్రవీణ్ పగడాల ప్రమాదంలో మృతి చెందాడని చిత్రీకరించే ప్రయత్నం జరగడం గర్హనీయమన్నారు. ఆయన మృతదేహం పై ఉన్న గాయాలు అనుమానాస్పదంగా ఉనందున అది ముమ్మాటికి హత్యేనని ఆయన స్పష్టం చేశారు. నిజానిజాలు తేల్చేందుకు కేసును సీబీఐకి అప్పగించాలన్నారు.

రెండు రోజుల పాటు వర్షం


రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం, శనివారం రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తహసీల్దార్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరిక మేరకు రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో పాటు అధిక గాలులు వీచే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయంలో ఎవరూ పొలాల వద్ద ఉండకూడదని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు.

టోల్‌ప్లాజాను పరిశీలించిన ఎమ్మెల్యే

బాగేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ప్రాధికార (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో కలసి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి స్థానిక నారేపల్లి టోల్‌ప్లాజాను పరిశీలించారు. ప్రయాణీకులకు సరైన సౌలభ్యాలు కల్పించకనే టోల్ వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం టోల్‌ప్లాజాను సందర్శించారు. కాంట్రాక్టర్‌ను తీవ్రస్థాయిలో మందలించారు. టోల్‌ప్లాజా నుంచి ప్రతి 20కిలోమీటర్ల పరిధిలో 2 క్రేన్‌లు, 2 అంబులెన్స్‌లు, 2 వాటర్ ట్యాంకులు ఉండాలి, జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటే గాయపడినవారిని అత్యవసరంగా తరలించే బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందన్నారు. అయితే ప్రమాదస్థలానికి ప్రభుత్వ అంబులెన్స్ మినహా కాంట్రాక్టర్ తరపునుంచి వెళ్లడం లేదని గుర్తించారు. అత్యవసర ఫోన్ నెంబర్లను తెలిపేలా ఎటువంటి నోటీసుబోర్డు లేకపోవడంపై మందలించారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. టోల్ పన్ను వసూలు చేయడంలో ఉన్న ఆసక్తి కనీస సదుపాయాలు కల్పించకపోతే ఎలాగని ప్రశ్నించారు. వారంరోజుల సమయం ఇస్తున్నామని, ప్రభుత్వ నియమాలను పాటించకపోతే టోల్ పన్ను వసూలు చేసేందుకు ఉండదని హెచ్చరించారు. నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న తహసీల్దార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. బాగేపల్లి టీబీ క్రాస్ నుంచి సమీపంలోని మదరసా ముందుభాగాన, పరగోడు సమీపంలోని సాలుమరద తిమ్మక్క పార్కు వరకు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఈ ప్రాంతంలో డివైడర్‌పై మీడియన్ రైలింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి ప్రాధికార ముఖ్య ఇంజనీర్ జగదీశ్, ఈఈ పంపాపతి, ఏఈఈ మల్లికార్జున్ మలికెరె, జేఈ శివణ్ణ, మేనేజర్ సౌరభ్, తహసీల్దార్ మనీష్ పత్రి, సీఐ ప్రశాంత్ వర్ధి పాల్గొన్నారు.



టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, ఇతర అధికారులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.78	1,580.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,824	926
నీటి నిల్వ (టీఎంసీలు)	9.26	4.54

విస్తరణలో స్థానం దక్కేనా..?

● ఏఐసీసీ సమావేశం తర్వాత మంత్రివర్గ విస్తరణ? ● కొత్తగా10 మందికి అవకాశం ● నాగేంద్రను అదృష్టం వరించేనా?



బళ్లారి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై ఆశలు జోరందుకున్నాయి. ఆశావహులు కోటి కళ్లతో ఎదురు చూపులు చూస్తున్నారు. వేటు పడేది ఎవ్వరికి.. స్థానం లభించేది ఎవరికో అని జోరుగా చర్చలు మొదలయ్యాయి. సీఎం మార్పుపైనా ఊహాగానాలు మొదలయ్యాయి. ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు గుజరాత్ లో ఏఐసీసీ సమావేశాలు నిర్వహించనున్నారు. అక్కడ పార్టీ పరంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ కీలక నేత పేర్కొన్నారు. గతంలో జరిగిన ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల సీఎం అలాగే మంత్రులను తప్పించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని డిల్లీ పెద్దల సమక్షంలో రాజకీయ ఒప్పందం జరిగింది. డీకే శివకుమార్‌కు బాధ్యతలు అప్పగించాలని కొందరు నేతలు జోరుగా డిమాండ్ చేస్తున్నారు. 2023 జూన్‌లో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా క్యాబినెట్ ఏర్పడింది. అంటే మరో ఆరుమాసాలకు రెండున్నరేళ్ల కాలం ముగియనుండంతో మార్పుపై ఊహాగానాలు జోరందుకున్నాయి.

ఇక మాజీ మంత్రి నాగేంద్ర విస్తరణపై ఆశలు పెంచు కున్నారు. బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర వాల్మీకి నిగమ మండలి నిధుల దుర్వినియోగం కేసులో లోకాయుక్త, సీబీఐ రెండు విచారణ సంస్థల విచారణ ఎదుర్కొంటున్నారు. కొన్నాళ్లు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటికి వచ్చారు. అయితే ఇప్పుడు కేబినేట్‌లో స్థానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎం కూడా ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలనే ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు మరో 8 నుంచి 10 మంది కి కొత్తగా మంత్రి వర్గంలో చేర్చుకోవాలి. పనిచేయని మంత్రులను తప్పించాలనేది అధిష్ఠానం ఆదేశం. వారిస్థానంలో సూచించిన పేర్లలో సీఎంకు రాజకీయంగా గిట్టని వారు కొందరు ఉన్నారు. అందుకే సీఎం కూడా అక్కడ కొంత కొర్రీ వేసి మౌనంగానే ఉన్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో మహిళలు తక్కువగానే ఉన్నారు. అందుకే విస్తరణలో వారికి పెద్దపీట వేయవచ్చని తెలుస్తోంది. సండూరు నుంచి ఉప ఎన్నికల్లో గెలుపొందిన అన్నపూర్ణ తుకారాంకు అవకాశం ఇవ్వాని ఎంపీ తుకారాం డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ కూడా రేసులో ఉన్నారు. ఇక విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అమ్మద్‌ను తన సొంత జిల్లాకు పంపి ఇక్కడ ఉండే ఎమ్మెల్యేలకే మంత్రి పదవి ఇవ్వాలని ఇక్కడ ఎమ్మెల్యేలు అనేక సార్లు పార్టీలో డిమాండ్ చేశారు. అయితే నాగేంద్రకు మంత్రి పదవి విషయంలో స్పష్టత లేదని, అది పార్టీ నిర్ణయం అని కొందరు సీనియర్ నాయకులు అంటున్నారు. అయితే ఆయనకు మంత్రిపదవి వస్తుందని ఆయన సన్నిహిత మిత్రులు, పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ముళ్ల పాన్పుపై పడుకున్న జగదీష్ గౌడ్

ముళ్ల పాన్పుపై ఊరేగింపు

కంప్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని బెన్నిహళ్లి గ్రామంలో గురువారం ఆంజనేయస్వామి రథోత్సవం సందర్భంగా జగదీష్ గౌడ్ అనే భక్తుడు ముళ్ల పాన్పుపై వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల పాటు ఉపవాసం ఉంటూ ఆయన గ్రామంలో వివిధ ధార్మిక పూజలు చేపట్టారు. భక్తుడిని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మూడు ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టండి

సిరుగుప్ప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 25వ వార్డులో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు.. నగరసభ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో 25వ వార్డులో ఇంతకుముందు వున్న రోడ్డు మొత్తం కంకర తేలి మట్టి రోడ్డుగా మారిందన్నారు. యేడాది నుంచి నగరసభ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు తక్షణం స్పందించి రోడ్డు బాగుకోసం కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యాప్రగతికి ప్రభుత్వం కృషి

సిరుగుప్ప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యాప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేనికృషి చేస్తుందని విద్యాశాఖాధికారి గుర్రప్ప తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో సాక్షరత సమితి విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా ప్రగతి కోసం విద్యార్థులకు వాచి, దోమల పరదాలు, వివిధ కిట్లను విద్యాశాఖాధికారి పంపిణీ చేశారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని ఆయన కోరారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా డీఆర్పీ అధికారి తమ్మన్నగౌడ పాటిల్, సాక్షరత సమితి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసీసీ తీర్మానం మేరకు నీరు విడుదల చేయాలి: రైతు సంఘం

కంప్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుండి ఎల్‌ఎల్‌సీకి ఐసీసీ తీర్మానం ప్రకారమే నీటిని విడుదల చేయాలని రైతు సంఘం హసురుసేన జిల్లా అధ్యక్షులు బీవీ గౌడ డిమాండ్ చేశారు. గురువారం కంప్లి పట్టణం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి నెలలో బెంగళూరులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐసీసీసమావేశాల్లో తీర్మానించిన ప్రకారం ఏప్రిల్ 10 వరకు ఎల్‌ఎల్‌సీ కాలువకు నీరు విడుదల చేయాలన్నారు. ముందుగానే నీరు నిలిపివేయడం సరికాదన్నారు.. ఎల్‌ఎల్‌సీ కింద చివరి ఆయకట్టు రైతులు ఈ నెల 15 వరకు పంటలకు నీటి అవసరం వుందన్నారు. చిన్ననీటి పారుదల శాఖ అధికారులు రైతులను దృష్టిలో వుంచుకుని రబీ పంటకు చివరి వరకు నీటిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తాలుకా రైతు సంఘం అధ్యక్షుడు వీరేష్, తిమ్మప్ప నాయక, మురారి, కొట్టూరు రమేష్, ఆదోని రంగప్ప, ఆనందగౌడ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ

ఉభయ జిల్లాల్లో భారీ వర్షం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హొసపేట నగరం, విజయనగరం జిల్లాలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం గురువారం ఉదయం వరకు కొనసాగింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించినట్లయ్యింది. కొన్ని చోట్ల వడగళ్ల వాన కురిసింది. అర్ధరాత్రి ప్రారంభమైన వర్షం తాలూకాలోని మరియమ్మనహళ్ళి ప్రాంతంలో తెల్లవారుజామున 3.45గంటలకు వర్షం ప్రారంభమవగా, హరపనహళ్ళి ప్రాంతంలో ఉదయం 5-30 గంటలకు వర్షం ప్రారంభమైంది. బళ్లారి జిల్లాలోని కంప్లి, సిరుగుప్ప తాలూకా , తెక్కల కోట తదితర ప్రాంతాలలో కూడా వర్షం కురిసింది.



హొసపేటలోని బళ్లారి రోడ్డు సర్కిల్లో నిలిచిన నీరు



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న కమిటీ సభ్యులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

● కర్ణాటక ఏకీకృత రక్షణ సేవాసమితి డిమాండ్

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని బండిహట్టిలోని పురాతన బావి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారని, చర్యలు తీసుకుని ఆ ప్రాంతాన్ని కాపాడాలని గురువారం కర్ణాటక ఏకీకృత రక్షణ సేవాసమితి రక్షించమని జిల్లా యంత్రాంగానికి వినతిపత్రం అందజేసింది. కమిటీ నాయకుడు శేఖర్ నేతృత్వంలో ప్రజలు బండిహట్టి నుండి డీసీ కార్యాలయం వరకు పాదయాత్రగా చేరుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ నీటిని దళిత దేవాలయాల శుభకార్యాలకు ఉపయోగించేవారు. బోర్‌వెల్స్ వచ్చిన తర్వాత బావి నీళ్ళు వాడుకోవడం లేదన్నారు. బావి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని కబ్జా దారులు ఆక్రమించు కుంటున్నారన్నారు. ఈవిషయంపై దర్యాప్తు జరిపి, దళితులకు అన్యాయం చేస్తున్న, మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బావిని దాని చుట్టూ ఉన్న భూమిని రక్షించాలని వారు కోరారు.

అధిక లాభాల పేరుతో మోసం

● నిందితుడి అరెస్ట్ ● రూ.19 లక్షల స్వాధీనం



నిందితుడు, నగదును చూపుతున్న పోలీసులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అధిక లాభాలు ఇస్తామని వినియోగదారులను నమ్మించి మోసం చేసిన ఆరోపణలతో విశ్వనాథ్ అనే వ్యక్తి గురువారం బ్రూస్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని గోల్డ్ స్మిత్ రోడ్డులోని కుంబర వీధి సమీపంలో వాసవీ స్వగృహ హోమ్ నీడ్ అనే దుకాణాన్ని తెరిచి ఓచర్ల రూపంలో డబ్బు తీసుకుని నెలకు 25శాతం లాభం ఇస్తామని హామీ నిందితుడు మోసం చేశారు. హోమ్ నీడ్స్ యజమాని విశ్వనాథ్ కస్టమర్ల నుంచి డబ్బు తీసుకుని వారు ఇచ్చిన అధిక లాభాలు ఇస్తానని ప్రకటించారు. సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్టార్ జ్ఞానప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేసి, రూ.19,38,500 స్వాధీనం చేసుకున్నారు. రశీదులు, వ్యాపారానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శోభారాణి ప్రకటించారు.

సహకార అధ్యక్షుడిని తొలగించాలని డిమాండ్



ఏడీఈ జుబేరాకు వినతిపత్రం అందజేస్తున్న వీవర్స్ అసోసియేషన్ సభ్యులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.రామకృష్ణను తొలగించాలని వీవర్స్ సంఘం డైరెక్టర్లు అదనపు జిల్లాకలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం నుంచి ప్రతినెలా దాదాపు రూ.1.50లక్షల అద్దె డబ్బును తన స్వంత ఖర్చుల కోసం ఉపయోగించడంతోపాటు, పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన పదవీ కాలంలో రూ.13,66,699 కు పైగా నగదును చెల్లించాల్సి ఉందని, కోర్టు కూడా రికవరీకి ఆదేశించిందని తెలిపారు. ఈసందర్భంగా రాటాల మంజునాథ్, ఓబుళపతి, నాగరాజ్, జక్కా లక్ష్మీనారాయణ, శేషాద్రి, మురళి, లక్ష్మీదేవి, పద్మావతి తదితరులున్నారు.



పుచ్చకాయలను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు వెంకటేష్

పుచ్చలాభాలు..!

● కలింగర సాగుతో కష్టాలు తీరాయంటున్న రైతు

కంప్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పుచ్చకాయల సాగుతో లక్షల లాభాలు గడించానని రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయనగర జిల్లా కనహసల్లి కూలిమినహత్తి గ్రామానికి చెందిన వెంకటేష్ తనకున్న మూడు ఎకరాల్లో కళింగర పంటను సాగు చేశారు. మండుతున్న ఎండల కారణంగా పండ్లకు డిమాండ్ బాగా పెరిగింది. బళ్లారి, బెంగళూరు నుంచి వ్యాపారులు వచ్చి పండ్లను కొంటున్నారు. కేజీ రూ.10 నుంచి 12 వరకు అమ్ముతున్నానని, వేసిన మూడు నెలల్లోపే రూ.మూడు లక్షలు లాభాలు తీసున్నట్లు వెంకటేష్ హర్షం వ్యక్తం చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వేసవిలో ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ ఇతర పంటలు వేసుకుని నష్టపోయానని, ఈ ఏడు కళింగరతో అధిక లాభాలు గడించానని పేర్కొన్నారు.

హోసూరు జోన్



రోడ్డుపై వర్షపు నీరు

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

హొసూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో గురువారం అకస్మికంగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు రోడ్లపై సుమారు మోకాలి లోతు మేర వర్షపునీరు నిలిచింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరోజులుగా ఎండలతో ఉక్కపోత అనుభవించిన ప్రజలు అకస్మాత్తు వర్షంతో కొంత ఊరట పొందారు. కాగా బాగలూరు రోడ్డులోని ఆలయ సమీపంలో డ్రైనేజీ కాలువ నుంచి మురుగునీరు సజావుగా ప్రవహించక వర్షపునీటితో కలసి రోడ్డుపైకి వచ్చింది. రద్దీగా ఉండే ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఇబ్బంది పడుతున్న వాహనదారులు

టోల్ చార్జీలు తగ్గించాలని కేంద్రమంత్రికి వినతి

హోసూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హోసూరు సరిహద్దులో కర్ణాటక పరిధిలోని అత్తిబెలెలో ఉన్న టోల్ గేట్‌లో చార్జీలు అధికంగా ఉంటున్నాయని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌కు అన్నాడీఎంకే నేత, రాజ్యసభ సభ్యుడు తంబిదురై విన్నవించారు. హోసూరు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో అత్తిబెలె టోల్‌గేట్ ఉంది. అత్తిబెలె నుంచి హోసూరుకు వచ్చేందుకు స్థానికులకు టోల్ మినహాయింపు ఉంది. అయితే హోసూరు పరిధిలో ఉంటున్న శూలగిరి, కామనదొడ్డి, పేరండపల్లి, మత్తిగిరి, జూజువాడి, మూకొండపల్లి, బేగేపల్లి, కెలమంగలం, ఉద్దనపల్లి తదితర గ్రామాల వారికి కూడా మినహాయింపు ఇవ్వాలని, ట్రాఫిక్ నివారణకు వీలు కల్పించేలా టోల్ గేట్ ప్రదేశాన్ని మార్చాలని కోరారు. ఈమేరకు అన్నాడీఎంకే పార్టీ హోసూరులో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.



కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌తో తంబిదురై

రోడ్డు ప్రమాదంలో టైలర్ మృతి

కెలమంగలం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న ప్రమాదంలో టైలర్ మృతి చెందిన సంఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అందేవనపల్లి సమీపంలోని మళ్లూరు గ్రామానికి చెందిన ముత్తప్ప కుమారుడు వీరప్ప (30) మృతుడిగా గుర్తించారు. బుధవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై డెంకణీకోటవైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డెంకణీకోట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.



వీరప్ప (ఫైల్)

గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హొసూరు క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా డెంకణీకోట సమీపంలోని కందకనపల్లిలోని నీలగిరితోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఇదే సందర్భంగా సమీపంలోని రైతు రామచంద్రప్పకు చెందిన రాగి వాముకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. మంటలు గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు నియంత్రించారు. వాము పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.1.5లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. పరిహారం అందించి, ఆదుకోవాలని రైతు.. అధికారులను కోరారు.

ఘనంగా దాసిమయ్య జయంత్యుత్సవం



విజేతలను సత్కరిస్తున్న దేవాంగ సమాజ సభ్యులు

కంప్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంగచౌడేశ్వరి ఆలయంలో దేవాంగ సమాజం తాలుకా పాలకవర్గం ఆధ్వర్యంలో తొలి వచనక దేవర దాసిమయ్య 1048వ జయంతోత్సవం కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ శివరాజు మాట్లాడుతూ దేవర దాసిమయ్య తొలి వచన రచయిత అని, వచన సాహిత్యాన్ని ప్రారంభించి కన్నడ సాహిత్యానికి విశేష కృషి చేశారన్నారు. దేవర దాసిమయ్య సూత్రాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరు స్వీకరించాల్సిన అవసరం వుందని ఆయన అన్నారు. ఆయన ప్రతిజ్ఞల సృష్టి ద్వారా సామాజిక అవగాహనను సృష్టించారు. వచన సాహిత్య సాంప్రదాయానికి ఆయన గట్టి పునాది వేశారని అన్నారు. 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన బంగి దొడ్డ మంజునాథ్‌లను దేవాంగ సమాజం, నేకార కమ్యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. దేవాంగ మఠం మంజునాథస్వామి, దేవాంగ సమాజం అధ్యక్షులు సప్పరద రాఘవేంద్ర నేత సంఘాల సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య, ప్రముఖులు మిట్టి శంకర్, సుధాకర్, విరుపాక్షి, మాగనూరు, రాజేశ్వరమ్మ, దూపాడ సుబాశ్చంద్ర, ప్రశాంత, ఎం శ్రీనివాస, శంకర్, తులసి, సుబ్బన్న, అంజి వున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆనలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ పాత బస్టాండ్‌లోని చింతమాను వద్ద 50 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తమకు సమాచారం అందించారన్నారు. ఉపాధ్యక్షుడు రవీంద్ర, సభ్యులు లింగేశ్వర్, అంజి, రత్నమ్మ, ఈరమ్మ, బాబు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కుందుర్పి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రంతో పాటు ప్రతి గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సునీత గీతా రాణి, నాగవేణి ఆధ్వర్యంలో మజ్జిగ అందించారు.